క్లుప్తంగా

నేడు వాహనాల వేలం

భూపాలపల్లి రూరల్ : భూపాలపల్లి ఎక్సైజ్ స్టేషన్‌లో పరిధిలో వివిధ కేసుల్లో పట్టుబడిన వాహనాలకు నేడు(బుధవారం) ఉదయం 10గంటలకు వేలం వేయనున్నట్లు ఎక్సైజ్ సీఐ రమ్య మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. వేలంలో పాల్గొనే వారు 50 శాతం సొమ్మును ముందస్తుగా చెల్లించాలన్నారు. వాహనం పొందిన అనంతరం అదేరోజు పూర్తి సొమ్మును చెల్లించాలని, అదనంగా జీఎస్టీ చెల్లించాల్సి ఉంటుందని పేర్కొన్నారు.

మాజీ ఎంపీపీకి స్ఫూర్తి పురస్కారం



కాళేశ్వరం : మహదేవపూర్ మాజీ ఎంపీపీ బన్నొడ రాణిబాయిరామారావు ఉత్తమ సామాజిక సేవలందించినందుకు గాను వసుంధర విజ్ఞాన వికాస మండలి ఆధ్వర్యంలో స్ఫూర్తి పురస్కారాన్ని సంస్థ నిర్వాహకులు అందజేశారు. మంగళవారం ఆమెకు హైదరాబాద్‌లోని రవీంద్రభారతి సన్మానించి, ప్రశంసపత్రంతో పాటు మెమొంటో ప్రదానం చేశారు. ఆమె చేసిన సేవలను సంస్థ నిర్వాహకులు కొనియాడారు.

ఎస్సైని సన్మానించిన తహసీల్దార్



వాజేడు: తెలంగాణ రాష్ట్ర ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా పేరూరు ఎస్సై కృష్ణ ప్రసాద్ సీఎం చేతుల మీదుగా గ్యాలెంటరీ అవార్డును అందుకున్నారు. ఈ నేపథ్యంలో ఎస్సై కృష్ణ ప్రసాద్‌ను మంగళవారం తహసీల్దార్ శ్రీనివాస్ శాలువా కప్పి సన్మానించారు. కార్యక్రమంలో డిప్యూటీ తహసీల్దార్ సత్యనారాయణ, ఆర్ఐ కుమారస్వామి, నాగరాజు, రాంబాబు తదితరులు ఉన్నారు.

బ్రిడ్జి పనుల పరిశీలన



ఏటూరునాగారం: మండలంలోని కొండాయి వద్ద జంపన్నవాగుపై నిర్మిస్తున్న బ్రిడ్జి పనులను కాంగ్రెస్ పార్టీ నాయకులు మంగళవారం పరిశీలించారు. బ్రిడ్జి నిర్మాణం కోసం మంత్రి సీతక్క ప్రభుత్వం ద్వారా రూ.16.50 కోట్లు మంజూరు చేయించినట్లు రఘు తెలిపారు. పనులు వేగంగా, నాణ్యతగా చేయాలని కాంట్రాక్టర్‌ను కోరినట్లు తెలిపారు. కార్యక్రమంలో వంగపండ్ల రవి, ఖలీల్, గౌస్, వేణు, తదితరులు పాల్గొన్నారు.

మద్యం తాగి వాహనాలు నడపొద్దు

ములుగు రూరల్ : మద్యం తాగి వాహనాలు నడపొద్దని ఎస్సై వెంకటేశ్వర్‌రావు మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఇటీవల మద్యం తాగి వాహనం నడిపి పట్టుబడిన 120 మందికి ములుగు మేజిస్ట్రేట్ రూ.1,59,200 జరిమానా విధించినట్లు తెలిపారు. ఆరుగురికి రెండు రోజుల సాధారణ జైలు శిక్ష విధించారని అన్నారు. ట్రాఫిక్ నిబంధనలు అతిక్రమించినా.. మద్యం సేవించి వాహనాలు నడిపినా కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు.

విజయవంతం చేయండి

ఎస్ఎస్ తాడ్వాయి: మండల కేంద్రంలోని బస్టాండ్ ప్రాంగణంలో ఈ నెల 12న చేపట్టే డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ విగ్రహావిష్కరణ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని విగ్రహ ప్రతిష్ఠాపన కమిటీ నాయకులు మంగళవారం ఒక ప్రకటనలో కోరారు. ఈ సందర్భంగా కమిటీ వారు మాట్లాడుతూ విగ్రహావిష్కరణ కార్యక్రమానికి ప్రజాప్రతినిధులు, అధికారులు, దళిత సంఘ నాయకులు, ఉపాధ్యాయులు, మేధావులు, కవులు, కళాకారులు, జర్నలిస్టులు హాజరై విజయవంతం చేయాలని కోరారు. కార్యక్రమంలో చంద్రయ్య, రాంబాబు, దేవేందర్, లచ్చు పటేల్, సునీల్, రాజశేఖర్, శ్రీకాంత్, శ్రీను, సమ్మయ్య తదితరులు పాల్గొన్నారు.

వైద్యశిబిరం

వాజేడు: మండల పరిధిలోని ఏడ్జెర్లపల్లి, బొమ్మనపల్లి, ధర్మవరం గ్రామాల్లో మంగళవారం వైద్యశిబిరాలను నిర్వహించారు. ఈ మూడు గ్రామాల్లోని ప్రజలను ప్రగళ్లపల్లి పల్లె దవాఖాన వైద్యాధికారి జ్ఞానస, పేరూరు వైద్య సిబ్బంది పరీక్షించారు. మలేరియా, డెంగీ, టైఫాయిడ్ లాంటి విష జ్వరాలు రాకుండా పాటించాల్సిన జాగ్రత్తలను వివరించారు. దోమలను అరికట్టడం మూలంగానే జ్వరాలు రాకుండా ఉండొచ్చని వివరించారు. ఎలాంటి అనారోగ్యానికి గురైనా ప్రభుత్వ ఆస్పత్రి రావాలని సూచించారు. అనంతరం గ్రామాల్లో తిరుగుతూ జ్వరాల తీవ్రత తెలుసున్నారు. కార్యక్రమంలో కోటిరెడ్డి, శ్రీదేవి ఉన్నారు.

వ్యర్థాలు..అనర్థాలు

కబళిస్తున్న కలుషితాలు
- వ్యాధుల బారిన ప్రజలు
- పట్టించుకోని అధికారులు



పేరుకుపోయిన ప్లాస్టిక్ వ్యర్థాలు

టేకుమట్ల : మానవుడి జీవితం నేడు కలుషితాలతో కలిసిపోయింది. నిత్య జీవితంలో వాడే అనేక వస్తువులు కలుషితమై మానవ మనుగడపై తీవ్ర ప్రభావం చూపుతోంది. అవగాహన రాహిత్యంతో జ్ఞానవంతులు సైతం ఎన్నో కాలుష్య కారక పదార్థాలను వినియోగిస్తూ భవిష్యత్ తరాలకు మనుగడ లేకుండా చేస్తున్నారు. ఎన్నో రకాల వ్యాధులతో ఉక్కిరిబిక్కిరి అవుతూ ఆస్పత్రులకు క్యూ కడుతున్నారు. నేడు వాతావరణ మార్పులకు ప్రధాన కారణంగా చెట్ల నరికివేత, పెరుగుతున్న జనాభా, వాహనాలు, కర్మాగారాలు, ప్లాస్టిక్ వినియోగం.

చెట్ల నరికివేత..

గాలిలోని కార్బన్ డై ఆక్సైడ్‌ను చెట్లు పీల్చుకుని ప్రాణవాయువైన ఆక్సిజన్‌ను విడుదల చేస్తుంది. దీంతో మానవాళికి ఎలాంటి హాని జరగకుండా చెట్లు కాపాడుతాయి. కానీ నేడు తమ ఇష్టానుసారంగా అడవులను నరికి వేస్తున్నాడు. చెట్లను నరకడం వల్ల ఆరోగ్యవంతమైన గాలిని పీల్చుకోలేక శ్వాసకోశ వ్యాధులతో బాధపడుతున్నారు.

అధిక జనాభా..

అధిక జనాభా వల్ల భూమండలంపై అన్ని కలుషితమై వాతావరణంపై తీవ్ర ప్రభావం చూపుతోంది. అధిక జనాభాకు సరిపడా ఆహార పదార్థాలు అందించేందుకు కొందరు అక్రమాలకు పాల్పడుతూ నకిలీ ఆహార పదార్థాలు తయారు చేస్తున్నారు. దైనందిన జీవితంలో వీటిని వాడడం వల్ల పలు రోగాల బారిన పడి ప్రజలు ఆర్థికంగా నష్టాలు అనుభవిస్తున్నారు. తినే ప్రతీ ఆహారం కల్తీ విషంగా మారడంతో మానవ మనుగడపై తీవ్ర ప్రభావం పడుతోంది. ప్లాస్టిక్ బియ్యం కూడా మార్కెట్‌లో లభ్యమవుతున్నాయంటే కల్తీల దందా ఏ మేరకు ఉందో అర్థం చేసుకోవచ్చు.

విచ్చలవిడిగా ప్లాస్టిక్ వినియోగం..

ప్లాస్టిక్ వస్తువులు ప్రస్తుతం భూమండలాన్ని అతలాకుతలం చేస్తున్నాయి. విచ్చలవిడిగా ప్లాస్టిక్‌ను ఉపయోగించడం వల్ల వాతావరణంలో ఎన్నో మార్పులు చోటు చేసుకుని మానవాళిపై తీవ్ర ప్రభావం చూపుతోంది. మార్కెట్లోకి ప్లాస్టిక్‌ను పూర్తి స్థాయిలో రాకుండా నిషేధించినప్పుడు మాత్రమే కొంత వరకు ప్లాస్టిక్‌ను అరికట్టవచ్చు. గతంలో ఎక్కడో ఒక ఆస్పత్రి ఉండేది. రోగాలు కూడా ఎక్కువగా వచ్చేవి కావు. ఆరోగ్యవంతమైన ఆహారం, స్వచ్ఛమైన వాతావరణంతో ప్రజలు సంపూర్ణ ఆరోగ్యవంతంగా ఉండేవారు. కానీ నేడు అందుకు భిన్నంగా ఎంతో మంది రోగాల బారిన పడి ఆస్పత్రుల్లో చికిత్స పొందుతున్నారు. ప్రధానంగా కలుషిత ఆహారం, ప్లాస్టిక్ వాడకం పై అవగాహన కల్పిస్తే ఆరోగ్యాన్ని కాపాడుకోగలం.

పోషకాహారంతో ఆరోగ్యం



ప్రతీ ఒక్కరు కలుషిత ఆహారం వైపు మొగ్గు చూపుతూ అనారోగ్యానికి గురవుతున్నారు. రోడ్లపై దొరికే చిరుతిళ్ల వల్ల ఆరోగ్యం పాడవుతుంది. సమయం ప్రకారం మితమైన ఆహారంతో పాటు, క్రమం తప్పకుండా వ్యాయామం చేస్తూ పోషకాహారం తీసుకుంటే ఆరోగ్యంగా ఉంటాం.

– డాక్టర్ ఆశాజ్యోతి, ప్రాథమిక ఆరోగ్య కేంద్రం, వెలిశాల

ప్రభుత్వ పాఠశాలల్లో మెరుగైన విద్య



తాడిచర్ల ఎస్సీకాలనీలో బడిబాట నిర్వహిస్తున్న ఉపాధ్యాయులు

మల్హర్ : ప్రభుత్వ పాఠశాలల్లోనే మెరుగైన విద్య లభిస్తుందని ప్రధానోపాధ్యాయుడు అరుణ్‌కుమార్ అన్నారు. జిల్లా విద్యాశాఖ ఆదేశాల మేరకు మండలంలోని తాడిచర్ల ఎస్సీ కాలనీ, కాపురం గ్రామాల్లో మంగళవారం బడిబాట కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా అరుణ్ కుమార్ మాట్లాడుతూ.. ప్రభుత్వ పాఠశాలలో ఉచిత పాఠ్యపుస్తకాలు, నోట్‌బుక్స్, దుస్తులు, మధ్యాహ్న భోజనం అందిస్తున్నట్లు తెలిపారు. అర్హత కలిగిన ఉపాధ్యాయులచే బోధన చేయడం జరుగుతుందని తెలిపారు. బడిఈడు పిల్లలను ప్రభుత్వ పాఠశాలలో చేర్పించాలని కోరారు. ఉపాధ్యాయులు సురేష్, తల్లిదండ్రులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

ఎస్టీ ఉద్యోగుల రోస్టర్ రికార్డుల పరిశీలన



రోస్టర్ రికార్డులను పరిశీలిస్తున్న చీఫ్ లైజర్ అధికారి కృష్ణయ్య, కమిటీ సభ్యులు

భూపాలపల్లి అర్బన్ : భూపాలపల్లి ఏరియాలో విధులు నిర్వహిస్తున్న ఎస్టీ ఉద్యోగులకు సంబంధించిన రోస్టర్ రికార్డులను చీఫ్ లైజన్ అధికారి వీసం కృష్ణయ్య మంగళవారం పరిశీలించారు.జీఎం కార్యాలయంలో జరిగిన కార్యక్రమానికి హాజరైన కృష్ణయ్యకు ఏరియా జనరల్ మేనేజర్ ఏనుగు రాజేశ్వర్‌రెడ్డి ఘన స్వాగతం పలికి మొక్కను అందజేసి శాలువాతో సత్కరించారు. భూపాలపల్లి ఏరియాలో పనిచేస్తున్న ఎస్సీడబ్ల్యూఏ ఉద్యోగుల ఏరియా స్థాయి అంతర్గత నియామకాలు, పదోన్నతుల్లో షెడ్యూల్డ్ తెగల రిజర్వేషన్ నియమాల అమలుకు సంబంధించిన రోస్టర్ రికార్డులను చీఫ్ లైజన్ ఆఫీసర్, కమిటీ సభ్యులు పరిశీలించారు. అనంతరం ఏరియాలోని వివిధ గనులు, విభాగాల్లో ఉన్న ఖాళీలకు అనుగుణంగా చేపట్టిన నియామకాలు, పదోన్నతుల వివరాలను పర్సనల్ మేనేజర్ కావూరి మారుతి అందజేశారు. ప్రభుత్వ ఉత్తర్వులకు అనుగుణంగా ఏరియాలో అమలు చేస్తున్న రూల్ ఆఫ్ రిజర్వేషన్ పద్ధతిని అడిగి తెలుసుకున్నారు. షెడ్యూల్డ్ తెగల రిజర్వేషన్ నిష్పత్తి ప్రకారం వివిధ గనులు, విభాగాల్లోని ఖాళీలు భర్తీ చేయాలని ఆదేశించారు. కమిటీ సభ్యులు భాస్కర్‌రావు, నాగేశ్వరరావు, అధికారులు కవీంద్ర, జ్యోతి, రవికుమార్, రాజు, రవి, ఎస్టీ ఉద్యోగుల సంఘం ప్రతినిధులు మోహన్, హేమ నాయక్, రాజు నాయక్, రాములు, అనిల్‌కుమార్, వెంకన్నలు పాల్గొన్నారు.

యూత్ కాంగ్రెస్ నాయకుల సంబురాలు



కాటారం: సంబురాల్లో నినాదాలు చేస్తున్న కాంగ్రెస్ పార్టీ నాయకులు

మల్హర్ : ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు సోదరుడు శ్రీనుబాబు తెలంగాణ రాష్ట్ర కాంగ్రెస్ పార్టీ జనరల్ సెక్రటరీగా నియమితులైన సందర్భంగా జిల్లా ఎస్టీ సెల్ ప్రధాన కార్యదర్శి లకావత్ సవేందర్ ఆధ్వర్యంలో మండలంలోని కొయ్యూరులో యూత్ కాంగ్రెస్ నాయకులు సంబురాలు చేసుకున్నారు. బాణసంచా పేల్చి, స్వీట్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా లకావత్ సవేందర్ మాట్లాడుతూ.. కాంగ్రెస్ పార్టీ ప్రభుత్వంలోకి రావడానికి కష్టపడ్డ ప్రతిఒక్కరినీ అధిష్ఠానం గుర్తిస్తోంది అనడానికి ఇదే నిదర్శనమని పేర్కొన్నారు. నూతన మంత్రులు గడ్డం వివేక్ వెంకటస్వామి, అడ్లూరి లక్ష్మణ్, వాకిటి శ్రీహరి, డిప్యూటీ స్పీకర్ రామచంద్రు నాయక్‌లకు శుభాకాంక్షలు తెలియజేశారు. కార్యక్రమంలో మాజీ కో ఆప్షన్ కలిమొద్దీన్, వార్డుమెంబర్లు ఎడ్ల రామ్, సీనియర్ నాయకులు మల్లారెడ్డి, బాపురెడ్డి, ఇషక్, స్వామి, మహేందర్, రవి, యూత్ కాంగ్రెస్ నాయకులు దేవేందర్, ఉమేష్, సర్జన తదితరులు పాల్గొన్నారు.

శ్రీనుబాబు సేవలకు గుర్తింపు

కాళేశ్వరం : మహదేవపూర్ మండల కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకుడు కటకం అశోక్ ఆధ్వర్యంలో రాష్ట్ర ఐటీ, పరిశ్రమలశాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు సోదరుడు దుద్దిళ్ల శ్రీనుబాబుకు తెలంగాణ ప్రదేశ్ కాంగ్రెస్ పార్టీ ప్రధాన కార్యదర్శిగా నియమించడం పట్ల హర్షం వ్యక్తం చేస్తూ కాంగ్రెస్ పార్టీ నాయకులు సంబురాలు నిర్వహించారు. మంగళవారం మహదేవపూర్ మండల కేంద్రంలోని శ్రీపాద చౌరస్తాలో బాణాసంచా కాల్చి, స్వీట్లు పంపిణీ చేసి సంబురాలు నిర్వహించారు. ఈకార్యక్రమంలో పార్టీ మండల అధ్యక్షుడు అక్బర్‌ఖాన్, పీఏసీఎస్ చైర్మన్ తిరుపతిరెడ్డి, పద్మ, సమ్మయ్య, సాంబయ్య, ఏజాస్, తిరుపతిరెడ్డి, శంకర్, నాగరాజు, నయీం, శివరాజ్ తదితరులు ఉన్నారు.

కాటారం : టీపీసీసీ జనరల్ సెక్రటరీగా దుద్దిళ్ల శ్రీనుబాబు నియామకాన్ని హర్షిస్తూ మంగళవారం మండల కేంద్రంలోని ప్రధాన కూడలిలో కాంగ్రెస్ నాయకులు సంబురాలు నిర్వహించారు. స్వీట్లు పంపిణీ చేసి బాణాసంచా పేల్చారు. శ్రీనుబాబుకు పదవి రావడంపై ఏఐసీసీ పెద్దలకు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో పార్టీ మండల అధ్యక్షుడు వేమునూరి ప్రభాకర్‌రెడ్డి, యూత్ కాంగ్రెస్ నియోజకవర్గ అధ్యక్షుడు చీమల సందీప్, చిటూరి మహేశ్‌గౌడ్, నాయకులు కడారి విక్రమ్, అంగజాల అశోక్, కొట్టె ప్రభాకర్, చీమల వెంకటస్వామి, భూపల్లి రాజు, తదితరులు పాల్గొన్నారు.



కేక్ కట్ చేస్తున్న యూత్ నాయకులు



కాళేశ్వరం: సంబురాలు నిర్వహిస్తున్న నాయకులు

న్యాయం చేయాలని బంధువుల ధర్నా



పోలీసులతో వాగ్వాదం చేస్తున్న మృతుడి కుటుంబ సభ్యులు, బంధువులు



దేవేందర్ (ఫైల్)

రేగొండ : రోడ్డు ప్రమాదంలో తీవ్రంగా గాయపడి మృతిచెందిన ఓ వ్యక్తి కుటుంబానికి న్యాయం చేయాలని కోరుతూ మృతుడి కుటుంబ సభ్యులు, బంధువులు మంగళవారం రూపిరెడ్డిపల్లిలో పరకాల–భూపాలపల్లి ప్రధాన రహదారిపై ధర్నా చేపట్టారు. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. మండలంలోని రూపిరెడ్డిపల్లి గ్రామానికి చెందిన పిట్ట దేవేందర్ (46) పరకాలలోని ఓ రైస్ మిల్‌లో పని చేస్తున్నాడు. ఈ క్రమంలో శనివారం రాత్రి పరకాల నుంచి ద్విచక్రవాహనంపై వస్తుండగా ఎదురుగా వస్తున్న బైక్ ఢీకొంది. ఈ ప్రమాదంలో దేవేందర్ తలకు బలమైన గాయం కావడంతో ఎంజీఎం ఆస్పత్రికి తరలించారు. చికిత్స పొందుతూ మంగళవారం ఉదయం మృతి చెందాడు. దేవేందర్ కుటుంబానికి న్యాయం చేయాలని కోరుతూ మృతుడి కుటుంబ సభ్యులు, బంధువులు ప్రధాన రహదారిపై ధర్నా చేపట్టారు. ట్రాఫిక్ స్తంభించి పోవడంతో విషయం తెలుసుకున్న రేగొండ ఎస్సై సందీప్ కుమార్ పరిస్థితిని సమీక్షిస్తుండగా మృతుడి కుటుంబ సభ్యులు, బంధువులు పోలీసులతో వాగ్వాదానికి దిగారు. అనంతరం మృతుడి బంధువులతో సీఐ మల్లేష్ మాట్లాడి న్యాయం చేస్తానని హామీ ఇవ్వడంతో ఆందోళన విరమించారు. మృతుడికి భార్య కవిత, ఇద్దరు కుమారులు ఉన్నారు.

దాహంతో తల్లడిల్లిన పసిపాప

రూపిరెడ్డిపల్లికి చెందిన దేవేందర్ రోడ్డు ప్రమాదంలో గాయపడి మృతిచెందగా న్యాయం చేయాలని బాధిత కుటుంబీకులు, గ్రామస్తులు పరకాల–భూపాలపల్లి ప్రధాన రహదారిపై ధర్నా చేపట్టారు. దీంతో 2గంటల పాటు వాహనాల రాకపోకలు స్తంభించాయి. అయితే ఆర్టీసీ బస్సులో కూర్చున్న మహిళ తన కొడుకు కోసం తీసుకువచ్చిన వాటర్ బాటిల్‌లో నీళ్లు అయిపోయాయి. దాహం అని ఏడుస్తున్నాడు. బస్సు వెళ్లనివ్వండి లేదా వాటర్ బాటిలైనా తీసుకురమ్మని మృతుడి బంధువులతో వాగ్వాదానికి దిగింది. ఆమెతో పాటు పలువురు ప్రయాణికులు కూడా ట్రాఫిక్ జామ్‌లో ఇరుక్కుపోవడంతో తీవ్ర అసహనం వ్యక్తం చేశారు.

పార్టీలకతీతంగా పేదలకు ఇళ్లు

- అనర్హుల పేర్లు ఉంటే తొలగిస్తాం..
- ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణరావు



లబ్ధిదారులకు ఇందిరమ్మ ఇళ్ల మంజూరు పత్రాలు అందజేస్తున్న ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణ రావు

మొగుళ్లపల్లి : పార్టీలకు అతీతంగా పేదలకు మొదటి విడతలోనే నియోజకవర్గంలోని అన్ని గ్రామాల్లో ఇందిరమ్మ ఇళ్లు మంజూరు చేస్తామని, అలాగే ఇందిరమ్మ ఇళ్ల పథకం జాబితాలో అనర్హుల పేర్లు ఉంటే వెంటనే తొలగిస్తామని భూపాలపల్లి ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణరావు అన్నారు. ఈ సందర్భంగా మంగళవారం మండల కేంద్రంతో పాటు ఇప్పలపల్లి, పోతుగల్, కొరికిశాల, గణేష్‌పల్లి, పెద్దకోమటిపల్లి, పర్లపల్లి, మొట్లపల్లి, గుండ్లకర్తి, మేట్టుపల్లి, నర్సింగాపూర్, వేములపల్లి, బంగ్లాపల్లి, ఎల్లారెడ్డిపేట, పిడిసిల్ల, ములకలపల్లి, ఇస్సీపేట, పాత ఇస్సీపేట, వాగొడ్డుపల్లి , చింతలపల్లి, రంగాపూర్ గ్రామాల్లో ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణ పనులకు శంకుస్థాపన చేశారు. అనంతరం ఆయా గ్రామాల్లో ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారులకు జిల్లా అదనపు కలెక్టర్, జెడ్పీ సీఈఓ విజయలక్ష్మి, జిల్లా హౌజింగ్ పీడీ లోకిలాల్‌తో కలిసి మంజూరు పత్రాలను అందజేశారు. అనంతరం కొరికిశాలలో ఏర్పాటు చేసిన భూభారతి అవగాహన కార్యక్రమంలో పాల్గొన్నారు.

పలు అభివృద్ధి పనులకు..

మండలంలోని మొట్లపల్లి, పిడిసిల్ల, రంగాపురం గ్రామాల్లో పల్లె దవఖానాలను ప్రారంభించారు. అలాగే గుండ్లకర్తి గ్రామ పంచాయతీ భవనానికి శంకుస్థాపన చేశారు. మొగుళ్లపల్లిలో అంగన్‌వాడీ కేంద్రం భవన నిర్మాణ పనులకు శంకుస్థాపన చేశారు. అనంతరం ఆయా గ్రామాల్లో ఏర్పాటు చేసిన సమావేశాల్లో ఆయన మాట్లాడుతూ..పేదవాడి సొంతింటి కలను నిజం చేయడమే సీఎం రేవంత్‌రెడ్డి , ప్రజా ప్రభుత్వ లక్ష్యమని అన్నారు. గుడిసెలో ఉన్న నిరుపేదలకే మొదటి విడతలో ప్రభుత్వం ఇళ్లు మంజూరు చేసిందని అన్నారు. ఎవరైనా అనర్హులకు ఇళ్లు వస్తే నా దృష్టికి తీసుకరండని వెంటనే వాటిని తొలగించి నిరుపేదలకు అందజేస్తామని అన్నారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ సునీత, మండల నాయకులు పాల్గొన్నారు.

సీసీ కెమెరాలు ప్రారంభించిన ఎమ్మెల్యే..

భూపాలపల్లి రూరల్ : భూపాలపల్లి పట్టణ పరిధిలోని 30వ వార్డు రెడ్డి కాలనీలో స్థానికులు ఏర్పాటు చేసిన సీసీ కెమెరాలను అదనపు కలెక్టర్ విజయలక్ష్మితో కలిసి ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణరావు మంగళవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ..సీసీ కెమెరాలతో నేరాల నియంత్రణను అరికట్టవచ్చని, ఒక సీసీ కెమెరా వంద మంది పోలీసులతో సమానమన్నారు. రెడ్డి కాలనీని ఆదర్శంగా తీసుకొని ప్రతి కాలనీలో ప్రజలు సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకోవాలని ఎమ్మెల్యే సూచించారు. ఈ కార్యక్రమంలో పీసీసీ సభ్యుడు చల్లూరి మధు, పార్టీ జిల్లా నాయకులు సాంబమూర్తి, మహేష్‌రెడ్డి, శ్రీనివాస్ రెడ్డి, కుమార్, శివారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

'కేంద్ర ప్రభుత్వ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలి'

ములుగు రూరల్: కేంద్ర ప్రభుత్వం చేపట్టిన సంక్షేమ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలని బీజేపీ జిల్లా అధ్యక్షుడు సిరికొండ బలరాం అన్నారు. ఈ మేరకు మంగళవారం వికసిత్ భారత్ అమృత కాలం సేవ సుపరిపాలన, పేదల సంక్షేమంపై మండల అధ్యక్షుడు నాగరాజు ఆధ్వర్యంలో సమావేశం నిర్వహించగా ఆయన ముఖ్యఅతిథిగా బలరాం హాజరై మాట్లాడారు. ప్రధాని నరేంద్ర మోదీ నాయకత్వంలో దేశ ప్రతిష్ఠ అంతర్జాతీయ స్థాయికి పెరిగిందన్నారు. దేశ ఆర్థిక వ్యవస్థలో 4వ స్థానానికి నిలబెట్టారని అన్నారు. ఆపరేషన్ సిందూర్ విజయవంతంతో దేశ దౌత్యసామర్థ్యం నిరూపితమైందని అన్నారు. గిరిజన మోర్చా రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కొత్త సురేందర్, కృష్ణాకర్, రవిరెడ్డి, వాసుదేవరెడ్డి, శ్రీహరి, రవందర్‌రావు, పాల్గొన్నారు.

ఆపరేషన్ సిందూర్ గర్వ కారణం

గోవిందరావుపేట: ఆపరేషన్ సిందూర్ విజయవంతం కావడం భారతీయులకు గర్వకారణమని భారతీయ జనతా పార్టీ జిల్లా అధ్యక్షుడు సిరికొండ బలరాం అన్నారు. మండల పరిధిలోని పస్రా గ్రామంలో మంగళవారం పార్టీ మండల అధ్యక్షుడు మార్క సతీష్ అధ్యక్షతన కార్యవర్గ సమావేశం నిర్వహించారు.

తవ్వారు.. పూడ్చడం మరిచారు

- ప్రమాదకరంగా రోడ్డుపై మట్టి కుప్పలు
- పట్టించుకోని అధికారులు



రోడ్డుపై ఉన్న మట్టికుప్పలు

చిట్యాల : మిషన్ భగీరథ పథకంలో భాగంగా పైపు లైన్ మరమ్మతుల కోసం ఇటీవల తవ్విన మట్టిని పూడ్చకుండా అలాగే వదిలేశారు. దీంతో వాహనాదారులు, ప్రయాణికులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. మండలంలోని జడలపేట గ్రామం నుంచి కొత్తపేట గ్రామానికి వెళ్లే రోడ్డుపై మట్టికుప్పలు ప్రమాదకరంగా ఉన్నాయి. ఏమైనా వాహనాలు ఎదురుగా వస్తే పెద్ద ప్రమాదం జరిగే అవకాశం ఉందని పలువురు వాహనాదారులు తెలిపారు. ఇప్పటికైనా సంబంధిత శాఖ అధికారులు వెంటనే రోడ్డుపై ఉన్న మట్టి కుప్పలను పూడ్చివేసి ప్రమాదాల నుంచి కాపాడాలని , బాటసారులు, పలువురు కోరుతున్నారు.

ఫర్టిలైజర్ షాపుల్లో తనిఖీ


మంగపేట: మండల కేంద్రంలోని పలు ఫర్టిలైజర్ షాపుల్లో టాస్క్‌ఫోర్స్ సీఐ రమేష్ ఆధ్వర్యంలో మంగళవారం తనిఖీలను నిర్వహించారు. ఈ సందర్భంగా ధరణి, లక్ష్మీప్రసన్న, మన గ్రోమోర్‌లో తనిఖీలు నిర్వహించారు. ఆయా షాపుల స్టాక్ వివరాలను అడిగి తెలుసుకున్నారు. రైతులకు ఎరువులు, పురుగు మందుల విక్రయాలను ప్రభుత్వ నిబంధనల మేరకు నిర్వహించాలని చెప్పారు. అనంతరం రైతు వేదికలో నిర్వహించిన సమావేశంలో సీఐ రమేష్ మాట్లాడారు. కార్యక్రమంలో ఏఓ చేరాలు, ట్రెయినీ ఎస్సైలు టీవీఆర్ సూరి, శ్రీకాంత్, టాస్క్‌ఫోర్స్ టీమ్ సభ్యులు పాల్గొన్నారు.

నకిలీ విత్తనాలు విక్రయించొద్దు

వాజేడు: రైతులకు నకిలీ విత్తనాలు విక్రయిస్తే చట్టపరంగా కఠిన చర్యలను తీసుకుంటామని మండల వ్యవసాయాధికారి ముంజ మహేశ్ హెచ్చరించారు. ధర్మవరం, చెరుకూరు గ్రామల్లోని విత్తన దుకాణాలను మంగళవారం ఆయన తనిఖీ చేశారు.

సదస్సును సద్వినియోగం చేసుకోవాలి

- తహసీల్దార్ లక్ష్మీరాజయ్య



రైతుల నుంచి దరఖాస్తు స్వీకరిస్తున్న తహసీల్దార్ లక్ష్మీరాజయ్య

రేగొండ(కొత్తపల్లిగోరి) : భూ సమస్యల పరిష్కారానికి మండలంలో కొనసాగుతున్న రెవెన్యూ సదస్సులను సద్వినియోగం చేసుకోవాలని తహసీల్దార్ లక్ష్మీరాజయ్య అన్నారు. మంగళవారం కొత్తపల్లిగోరి మండలంలోని జమ్‌షేడ్‌బేగ్‌పేట గ్రామంలో రెవెన్యూ సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా 111 దరఖాస్తులు స్వీకరించినట్లు తెలిపారు. సదస్సులో వచ్చిన దరఖాస్తులను పరిశీలించి, వాటి పరిష్కారానికి కృషి చేస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో రెవెన్యూ సిబ్బంది నేత వెంకటేష్, పకిడే రాజయ్య, శ్వేత, జ్యోతి, మధుతో పాటు తదితరులు పాల్గొన్నారు.